క్లుప్తంగా

క్రీడా పాఠశాల్లో ప్రవేశాలకు పోటీలు

పినపాక: మండల పరిధిలోగల ఏడుళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ క్రీడల పాఠశాల్లో నాలుగో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పినపాక ఎంఈఓ నాగయ్య శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 18వ తేదీన ఇదే పాఠశాలలో సంబంధిత క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి, జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ వివరాలను ఆన్లైన్లో tgss.telangana.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆ రిజిస్ట్రేషన్ ప్రింట్ తీసుకుని 18వ తారీకు ఉదయం 9గంటలకు ఏడుళ్ల బయ్యారం ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని ఎంఈఓ తెలిపారు.

సీసీ రోడ్లు ప్రారంభం

అశ్వాపురం: మండల పరిధిలోని కల్యాణపురం, మిట్ట గూడెం, బట్టీల గుంపు, జగ్గారం, అమెర్ద గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన రూ.1కోటి విలువ గల సీసీ రోడ్లను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీలో 2024–25 సంవత్సరానికి గాను మండలంలో రూ.2.65 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామని, మిగతా గ్రామ పంచాయతీలలో త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అన్ని గ్రామాల్లో దశల వారిగా సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యాలరావు, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చారి, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోత్సరణల నడుమ స్వామి క్రతువు శాస్త్రోక్తంగా జరిపించారు. ములకలపల్లి మండలానికి చెందిన నున్నా జగదీష్, రమాదేవి దంపతులు భక్తులకు అన్నదానం చేయించారు. ఆలయ ఇన్‌చార్జీ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'హామీల అమలులో విఫలం'

చర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇంత వరకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదని, మాయమాటలతో ప్రజలను మోసం చేస్తూ కాలం వెల్లదీస్తున్నారని బీఎస్పీ చర్ల మండల అధ్యక్షుడు కొండా చరణ్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని చర్లలో ఉన్న బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని కోరెగడ్డ భూముల నిర్వాసితులకు కూడా సీతమ్మసాగర్ నిర్మాణానికి సంబంధించి పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి బీఎస్పీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఎస్పీ నాయకులు సామల ప్రవీణ కొండా కౌశిక్, గోగికార్ రామలక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుల ఎన్నిక

మణుగూరురూరల్: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడిగా కుంటా లక్ష్మణ్‌లను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వేర్పుల సురేష్, బీజేఈ సెల్ మండల అధ్యక్షుడు అక్కి నర్సింహారావు, నాయకులు దామల్ల దయాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఫుల్ వీల్స్ నిషేధం

దమ్మపేట: వ్యవసాయంలో వినియోగించే ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపై తిరగడం నిషేధం అని దమ్మపేట ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫుల్ వీల్స్‌తో ట్రాక్టర్లు బీటీ, సీసీ రోడ్లపై తిరగడం వల్ల రోడ్లు ధ్వంసమవుతాయని అన్నారు. సంబంధిత ట్రాక్టర్ల యజమానులకు గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా నోటీసులు అందుతాయని, నిబంధనలను అతిక్రమించిన వారి ట్రాక్టర్లను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించి, ఫుల్ వీల్స్ విషయంలో రైతులను చైతన్యపరచి, రోడ్లు పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మంత్రి తుమ్మల పరామర్శ

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన మాజీ సొసైటీ డైరెక్టర్ ఒగ్గు లక్ష్మారెడ్డి కొద్దిరోజుల కిందట అనారోగ్య కారణంగా మృతి చెందగా.. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.



భద్రాచలంలోని ఓ షోరూంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఈ-స్కూటీలు



ఈ-స్కూటీపై వెళ్తున్న స్థానికులు

ఎలక్ట్రిక్ బైక్‌ల జోరు

- ఏజెన్సీలో పెరుగుతున్న వాహనాల సంఖ్య
- కాలుష్య రహితం.. ఖర్చుల మిగులు
- ఆసక్తి చూపుతున్న ప్రజలు

రోజురోజుకూ ఎలక్ట్రిక్ స్కూటీల వినియోగం పెరిగిపోతోంది. పట్టణాల నుంచి పల్లెల వరకు వీటిని వినియోగిస్తున్నారు. రిజిస్ట్రేషన్, లైసెన్సు అవసరంలేకపోవడం, ఒక యూనిట్ విద్యుత్ ఖర్చుతో 60 నుంచి 80 కిలో మీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉండడంతో ఈ వాహనాలను గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా విరివిగా వాడుతున్నారు. ప్రస్తుతం భద్రాచలంలో కూడా వీటి వినియోగం పెరిగింది.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది. ప్రతి ఇరవై మందిలో ఇద్దరు, ముగ్గురు ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటీలనే కొనుగోలు చేస్తున్నారు. కేవలం భద్రాచలంలోనే మొత్తం 200కు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు తిరుగుతున్నాయి. ఎలక్ట్రిక్ కార్ల వాడకం సైతం క్రమంగా పెరుగుతోంది. పెరుగుతున్న పెట్రోల్ వాహన ధరలు, ఇంధన ధరలు, మరమ్మతుల ఖర్చుల కారణంగానే వినియోగదారులు ఎలక్ట్రిక్ బైక్‌ల వైపు మొగ్గుతున్నారు. బరువు తక్కువగా ఉండడం, సులువుగా నడిపేందుకు అవకాశం ఉండడం కూడా ప్రజలను ఆకర్షించడానికి కారణం. అయితే, వినియోగదారులకు అనుగుణంగా ఎలక్ట్రిక్ బైక్‌ల షోరూమ్‌లు కూడా పెరుగుతున్నాయి. పట్టణ వ్యాప్తంగా ఇప్పటికే 7కు పైగా షోరూమ్‌లు వెలిశాయి. ఈ నేపథ్యంలో ఈ-బైక్‌ల పనితీరు, వాటి ప్రత్యేకతలు తెలుసుకుందాం..



బ్యాటరీల పనితీరు ఇలా..

వాహన బ్యాటరీ ఫుల్‌చార్జ్ కావడానికి బ్యాటరీ మోడల్‌ను బట్టి 4 నుంచి 6 గంటల సమయం పడుతుంది. బ్యాటరీల్లో గ్రాఫైన్, లిథియం అయాన్ బ్యాటరీ మోడళ్లు ఉంటాయి. గ్రాఫైన్ బ్యాటరీ ఎక్కువ సమయం చార్జ్ అవుతుంది తక్కువ దూరం ప్రయాణిస్తుంది. లిథియం అయాన్ బ్యాటరీ తక్కువ సమయంలో చార్జ్ అవుతుంది ఎక్కువ దూరం ప్రయాణిస్తుంది. ఈ రెండింటిలో గ్రాఫైన్ బ్యాటరీ వాహన ఖరీదు తక్కువ, లిథియం అయాన్ బ్యాటరీ వాహన ధర ఎక్కువ. ఏదైనా ఒక్క యూనిట్ చార్జ్ తో 60 నుంచి 80 కిలోమీటర్లు ప్రయాణం చేయొచ్చు. వీటిని నిత్యం 50 కిలో మీటర్లలోపు తిరిగే రైతులు, మహిళలు, ఉద్యోగులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. వీటి వాడకానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రతీ 50 కిలో మీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే మరింత వాహనాల సంఖ్య పెరిగే అవకాశముంది.

ఖర్చులో వ్యత్యాసం..

పెట్రోల్ ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో జనం ఈవీతో ఖర్చులను భారీగా ఆదా చేసుకుంటున్నారు. పెట్రోల్‌తో నడిచే వాహనం సాధారణంగా 40 కిలోమీటర్ల మైలేజీనే ఇస్తుండగా, లీటర్ ధర ప్రస్తుతం రూ.110 ఉంది. అదే ఈవీ స్కూటర్కు ఒకసారి చార్జ్ చేస్తే దాదాపు 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించ వచ్చు. ఫుల్ చార్జ్‌కి రెండు నుంచి మూడు యూనిట్లు ఖర్చు అవుతుంది.

లోస్పీడుకు నో రిజిస్ట్రేషన్

గంటకు 25 కిలోమీటర్లలోపు స్పీడ్‌తో వెళ్లే స్కూటీలకు ఎలాంటి రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదు. అంతకు పైగా వెళ్తే అవి తప్పనిసరి. అన్ని రకాల ఇతర నిబంధనలూ వర్తిస్తాయి. అయితే ఎలక్ట్రిక్ బైక్‌లు స్పీడ్‌ను బట్టి ధర ఉంటుంది. రూ.1.30 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు మార్కెట్లో ధర పలుకుతోందని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.

సబ్సిడీ అందిస్తున్న కేంద్రం...

ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటీలు, కార్లను కొనుగోలు చేసే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ నజరానా ఇస్తోంది. స్కూటీలు, బైకులు కొనుగోలు చేస్తే వినియోగదారుడికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు సబ్సిడీని కేంద్రం అందిస్తోంది. పెట్రోల్ వినియోగం ఎంత తగ్గితే అంత పొల్యూషన్ తగ్గడంతో పాటు ఖర్చులు తగ్గించి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకో వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా సబ్సిడీ ఇస్తోంది.

ఆనందంగా తిరుగుతున్నా..



నేను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుంటా. పని మీద ఎక్కువ సార్లు తిరగాల్సి వస్తుంది. ఏడాది క్రితం ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేసి వాడుతున్నా. నాలాంటి వాళ్లకు ఇది బాగానే ఉపయోగపడుతోంది. ఒక్కసారి చార్జ్ చేస్తే వేగాన్ని బట్టి రోజు 70 నుంచి 80 కిలోమీటర్ల వరకు తిరగవచ్చు. దీనివల్ల డబ్బులు ఆదా అవుతుంది. అంతేకాకుండా పొల్యూషన్ కూడా తగ్గుతుంది. – గుగులోత్ పరశురాం, భద్రాచలం

ఒక్క సారే పెట్టుబడి..



ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేసేందుకు ఒక్కసారే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఆలోచనతో నేను మూడేళ్ల క్రితం ఓలా ఎలక్ట్రిక్ స్కూటీ కొనుగోలు చేశాను. ఇప్పటి వరకు 26 వేలు కిలోమీటర్లు తిరిగాను. ఒక్కసారి ఇంట్లో చార్జింగ్ చేస్తే 120 కిలోమీటర్లు వరకు ప్రయాణం చేయొచ్చు. ఏడాదిలో రూ.36 వేలు ఇందన ఖర్చు తగ్గింది. వాహనం చోరీకి గురవుతుందనే బాధలేదు. ప్రభుత్వాలు ఇంకా రాయితీ ఇస్తే వీటి వినియోగం ఇంకా పెరుగుతుంది.
– భగవాన్ రెడ్డి, సారపాక

మావోయిస్టులకు సహకరించొద్దు




అశ్వాపురం: గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌రెడ్డి

అశ్వాపురం: మావోయిస్టులకు సహకరించవద్దని ఎవరైనా కొత్తవారు గ్రామాలకు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ అశోక్‌రెడ్డి మారుమూల గ్రామాల గిరిజనులకు సూచించారు. మండల పరిధిలోని మారుమూల గ్రామమైన మనుబోతులగూడెం గ్రామ పంచాయతీలోని ఐతయ్య గుంపు, మల్లయ్యగుంపులో సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు చేపట్టారు. గ్రామాలకు ఎవరైనా కొత్త వారు వచ్చారా లేదో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టులతో మావోయిస్టులు ఈ ప్రాంతంలో తలదాచుకునే అవకాశం ఉందని, కొత్త వారిని ఎవరిని గ్రామాలకు రానివ్వద్దని సూచించారు. మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పథకాలు రద్దు చేస్తామని సీఐ హెచ్చరించారు.

మణుగూరుటౌన్: అపరిచితుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సమాచారం అందించాలని సీఐ నాగబాబు అన్నారు. శనివారం వలస బుగ్గ, ఖమ్మంతోగు గ్రామాలతో పాటు ఆదివాసీగ్రామాలను సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దని సూచించారు. ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలన్నారు. గ్రామస్తుల పేర్లు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్, సిబ్బంది కోటి ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

చర్ల: రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేసినట్లేనని, ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని చర్ల ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ హారిక పేర్కొన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని విజయకాలనీ రక్తదానంపై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చునని, దానివల్ల ఎటువంటి ఇబ్బందులూ ఉండవని ఆమె స్పష్టం చేశారు. సదస్సులో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, మిడ్ హెల్త్ ప్రొవైడర్ శిరీష, హెల్త్ అసిస్టెంట్ స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, ఆశా కార్యకర్త ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హారిక, సిబ్బంది

పార్టీ అభివృద్ధికి పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా

అశ్వారావుపేట: పార్టీలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా అన్నారు. శనివారం అశ్వారావుపేట సీపీఐ మండల 16వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గానికి అభినందనలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మరోవైపు, ఆయన అశ్వారావుపేట రహదారి విస్తరణ బాధితులతో మాట్లాడారు. వారికి అన్యాయం జరిగితే సహించబోమని అధికారులను హెచ్చరించారు. నూతన కార్యవర్గ సమావేశంలో అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ.. నూతన కమిటీలో ఎన్నికయని సభ్యులు ప్రతి ఒక్కరూ పార్టీ ఆదేశానుసారంగా పనిచేయాలని సూచించారు. నూతన కమిటీ మండల ఇన్‌చార్జ్‌గా గన్నిన రామకృష్ణ, కార్యదర్శిగా వగ్గెల అర్జునరావు, సహాయ కార్యదర్శులుగా చిన్నయ్య, కోర్స తిరుపతి రావు, ముక్కంటిలను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా చేతుల మీదుగా సీపీఐ నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని రజబ్‌అలీ భవన్‌గా నామకరణం చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కార్యదర్శి నూకవరపు విజయ్‌కాంత్, డివిజన్ కమిటీ సభ్యుడు జోగిరాజు, జాయింట్ సెక్రటరీ సయ్యద్ జాకీర్, బలరాం, ఏఐటీయూసీ నాయకులు పఠాన్ జలాల్ ఖాన్, అనిల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో మైనార్టీ నాయకుడి మృతి

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు, మాజీ మండల అధ్యక్షుడు ఎస్‌కే.బషీర్(56) శనివారం గుండె పోటుతో మృతి చెందాడు. బషీర్‌కు రాత్రి గుండె నొప్పి రాగా కుటుంబసభ్యులు భద్రాచలం తరలించగా ఆస్పత్రిలో మృతి చెందాడు. బషీర్ మృతికి ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌కె.ఖదీర్, నాయకులు, పలు పార్టీల, సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన ఘటన శనివారం జరిగింది. మండలంలోని కేశప్పగూడేనికి చెందిన బేతి శిరమయ్య, కుర్సం రమేష్, ఆనంద్ కలిసి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట నుంచి తమ స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలోని ఊట్లపల్లి గ్రామ సమీపంలో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో శిరమయ్యకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, రమేష్, ఆనంద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇదే సమయంలో విధులకు వెళ్తున్న వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ ఘటన స్థలం వద్ద ఆగి గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పంపించారు.

రోడ్డుపై పడిన చెట్టు

దమ్మపేట: గొర్రెగుట్ట గ్రామ శివారులో శనివారం మధ్యాహ్నం వీచిన గాలుల తాకిడికి బీటీ రోడ్డుకు అడ్డంగా పెద్ద చెట్టు పడిపోయింది. దీనితో మండలంలోని గండుగులపల్లి నుండి గోపాలపురంకు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రైతులు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు, ఎంపీడీఓ రవీంద్రా రెడ్డికి ఫోన్‌లైన్‌లో సమాచారం అందించగా.. గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా చెట్టును తొలగింపజేశారు. రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

ఆ ప్రచారం అవాస్తవం

చర్ల: గత రెండు రోజులుగా ఇసుక క్వారీల్లో లారీలకు పట్టాలు కడితే కోట్లకు పడగలెత్తుతున్న కూలీలు అంటూ వస్తున్న వార్తలన్నీ అవాస్తమని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రమైన చర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్ల మండలంలోని కొయ్యూరు పంచాయతీలో ఉన్న ఇసుక క్వారీల్లో బడా కాంట్రాక్టర్లు రైజింగ్ కాంట్రాక్టర్ల పేరుతో చేరి గిరిజనులను వర్గాలుగా విడదీసి వైషమ్యాలను సృష్టిస్తున్నారని, బంధుత్వాలను తెంచుతున్నారని ఆరోపించారు. జీఎస్పీ నాయకులు ఇర్పా ప్రకాశ్, సోడి సురేష్, చందర్‌రావు, జానకిరాం పాల్గొన్నారు.

సత్వర పరిష్కారమే ధ్యేయం

మణుగూరురూరల్: రాజీమార్గం ద్వారా సత్వర కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ ధ్యేయమని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి అన్నారు. శనివారం కోర్ట్ ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ సూరిరెడ్డి మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజమార్గమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ ద్వారా సత్వర పరిష్కారం చేయవచ్చన్నారు. కక్షిదారులు కేసుల పరిష్కారం కోసం రాజీమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో సీసీ, పిటీ, బ్యాంక్ పీఎల్‌సీ వంటి కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఆయా కేసులకు జరిమానాలు సైతం విధించి రాజీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ కౌన్సిల్ సభ్యులు అంకం సర్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, లోక్‌అదాలత్ సభ్యులు, న్యాయవాదులు పద్మావతి, పోశం భాస్కర్, కోర్ట్ సిబ్బంది, కోర్ట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: సత్వర న్యాయ పరిష్కారమే లోక్ అదాలత్ ధ్యేయమని భద్రాచలం జ్యుడిషియల్ కోర్టు న్యాయమూర్తి జి.శివనాయక్ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించాగా.. ఒప్పందాల ద్వారా 989, రాజీ ద్వారా 89, బ్యాంక్ పీఎంఎల్‌సీ ద్వారా 168 కలిపి మొత్తం 1,246 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి తెలిపారు. బ్యాంక్ పీఎంఎల్‌సీ కేసుల ద్వారా రూ.1.55 కోట్లు, సమ్మర్ ట్రయిల్ కేసుల ద్వారా రూ.3.29 లక్షలు, సీసీ కేసుల ద్వారా ఒక లక్ష రూపాయాలు వసూళ్లు అయిన్నట్లు పేర్కొన్నారు. అనంతరం బార్ అసోసియేషన్, ఎస్బీఐ, దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పులిహోర ప్యాకెట్ల పంపిణీని న్యాయమూర్తి శివ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, కోర్ట్ కానిస్టేబుళ్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

దమ్మపేట: దమ్మపేట జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులోశనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు. జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ భవాని ఆధ్వర్యంలో దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు సంబంధించి 100 కేసులు పరిష్కరింపబడ్డాయి. 400 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు జరిమానా విధించారు. కాగా, హాజరైన కక్షిదారులకు శ్రీరంగనాథ స్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ స్వామిజీ 250 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి కక్షిదారులకు వడ్డన చేశారు.



మణుగూరురూరల్: మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి



దమ్మపేట: అన్నదానంలో భాగంగా కక్షిదారులకు వడ్డన చేస్తున్న సీఐ, ఎస్సైలు

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో పంచాయితీరాజ్, ఐటీడీఏ అధికారులతో, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆయా డిపార్ట్‌మెంట్ల పరిధిలోనున్న సమస్యలు, భవిష్యత్తు ప్రణాళికల గురించి సమగ్రంగా చర్చించారు. గ్రామాల్లో తలెత్తనున్న ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి, త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈలు, ఐటీడీఏ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నూతన నంబర్లు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఫోన్ నంబర్లు మారాయి. బీఎస్ఎన్ఎల్ నుంచి ఏయిర్‌టెల్‌కు నంబర్లు మార్చారు. కొత్త మారిన నంబర్లలో ఏడీఈ –8712485895గా ఉంది. ఏఈ– 8712485917, మద్దుకూరు సబ్‌స్టేషన్–3712485915, పెంట్లం సబ్‌స్టేషన్– 8712485921, లైన్‌ఇన్స్‌పెక్టర్–8712485918, అన్నపురెడ్డిపల్లి లైన్‌మెన్–8712485919, ఎర్రగుంట లైన్‌మెన్–8712485920 నంబర్లను సంప్రదించవచ్చు.

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు మండల ఏఈ మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఏఈ ఆపరేషన్ 87124 86063, సబ్ ఇంజనీర్ 85004 13891, దుమ్ముగూడెం సబ్‌స్టేషన్ 87124 86070, లచ్చిగూడెం సబ్‌స్టేషన్ 87124 86071, పర్ణశాల సబ్‌స్టేషన్ 87124 86072, ఎస్ఎల్ఐ దుమ్ముగూడెం 87124 86064, ఎల్ఐ దుమ్ముగూడెం 87124 86065, ఎల్ఐ పర్ణశాల 87124 86066, లైన్‌మేన్ దుమ్ముగూడెం 87124 86067, లైన్‌మెన్ సీతారాంపురం 87124 86068,లైన్‌మేన్ లచ్చిగూడెం 87124 86069 నంబర్లకు విద్యుత్ సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

చర్ల: చర్ల మండలంలోని దేవరాపల్లి గ్రామ పంచాయతీలో పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా.. సంబంధిత పత్రాలను శనివారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అందజేశారు. స్థానిక దేవరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పంచాయతీ పరిధిలోని 38 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరవ్వగా.. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాం అలా జరుగుతోందని అన్నారు. అనంతరం పంచాయతీ పరిధిలోని రాళ్లగూడెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ వలీ, పంచాయతీ ప్రత్యేకాధికారి వాసుదేవరాజు, పంచాయతీ కార్యదర్శి తుర్రం రాంకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, బోళ్ల వినోద్, తోటమళ్ల రవికుమార్, జీసునీల్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ నుంచి తొలగించాలి

చర్ల: తమ సొసైటీకి సంబంధం లేని మహిళలను సొసైటీ నుంచి తొలగించాలని చర్ల మండలంలోని చీమలపాడులో ఉన్న సిర్రాజు మహిళా సొసైటీ డిమాండ్ చేసింది.

ఈ మేరకు శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీ సభ్యులు మాట్లాడారు. సిర్రాజు మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఇసుక క్వారీలు నిర్వహిస్తుండగా.. ఈ సొసైటీలో గ్రామానికి సంబంధం లేని మహిళలు ఉన్నారని, వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

కరెంట్ వస్తేనే సన్న బియ్యం!

అశ్వారావుపేటరూరల్: రేషన్ బియ్యం, సరుకుల కోసం కొండరెడ్లు గంటల కొద్ది చెట్టు కింద కుర్చొని పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అశ్వారావుపేట మండలంలోని కొండ రెడ్ల గ్రామమైన పాత రెడ్డిగూడెం గ్రామంలో గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఆధ్వర్యంలో రేషన్ దుకాణం నడుస్తోంది. ఈ దుకాణం పరిధిలో పాత రెడ్డిగూడెం, రెడ్డిగూడెం, బండారుగుంపు, సుద్దగోతులగూడెం గ్రామాలు ఉండగా మొత్తం 700 రేషన్ కార్డులు ఉన్నాయి. కాగా, శనివారం ఉదయం కొండరెడ్లు సన్న బియ్యం కోసం దుకాణానికి వచ్చారు. అయితే, కరెంట్ లేకపోవడంతో వేలిముద్రలు వేసే బయోమెట్రిక్ యంత్రం చార్జింగ్ లేక మొరాయించింది. రెండు గంటలు దాటినా కరెంట్ రాకపోవడంతో లబ్ధిదారులు రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కింద పడిగాపులు పడాల్సి వచ్చింది. దీంతో వారంతా అవస్థలు పడాల్సి వచ్చింది. కరెంట్ వస్తే సన్న బియ్యం ఇస్తారని, అప్పటి దాకా మాకు తిప్పలు తప్పవని కొండరెడ్లు వాపోతున్నారు.



చెట్టు కింద పడిగాపులు కాస్తున్న కొండరెడ్లు